ఊసే లేని పెట్టుబడి సాయం



- అన్నదాత సుఖీభవకు మంగళం
- కొంత మందికే పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి
- రూ.20 వేల పెట్టుబడి సాయం కోసం ఎదురుచూపులు

ఓజిలి: ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు ఆకట్టుకుని అధికారంలోకి వచ్చారు. సూపర్‌సిక్స్ పథకాలలో ఒక్కటైన అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం పేరుతో ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని అధికారంలోకి వచ్చాక రైతులను పట్టించుకోవడం మానేశాడు. వ్యవసాయం దండగా అన్న చంద్రబాబు మాటలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే రైతుభరోసా కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టి రైతుల ముంగిటకే సేవలను తీసుకొచ్చారు. అధికారంలోకి రాగానే రైతులకు పెట్టుబడి సాయం ద్వారా రూ.13,500 నగదును నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాడు. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఈ పథకం ప్రస్తావనే లేకుండా పోయిందని రైతులు మండిపడుతున్నారు.

కొందరికే పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి

ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన పీఎం కిసాన్ సమ్మాన్ నిధి జమకాక కొంత మంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు ఆర్థికంగా అండగా ఉండాలన్న లక్ష్యంతో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2019లో ప్రారంభించింది. ఈ పథకం కింద ఈ ఏడాది అక్టోబర్ 5వ తేదీన పీఎం నరేంద్రమోదీ 18వ విడత సాయాన్ని విడుదల చేశారు. ఏడాదికి రూ.6 వేలు చొప్పున మూడు వాయిదాల్లో రూ.2 వేల ప్రకారం రైతుల ఖాతాల్లోకి ఈ పథకం కింద ఆర్థిక సాయాన్ని జమ చేస్తున్నారు. అయితే అర్హత ఉన్న రైతులు ఆర్థిక సాయం అందక కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. ప్రధానంగా ఈకేవైసీ పూర్తి చేసుకోని రైతులకు లబ్ధి చేకూరడం లేదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో అర్హులుగా ఉండి నగదు జమ కాని రైతులు బయోమెట్రిక్ ఆధారిత ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. కేవలం 2019 ఫిబ్రవరి 20వ తేదీకి ముందు ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలకు మాత్రమే ఈ పథకం కింద లబ్ధిదారులుగా నమోదయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు వాపోతున్నారు.

అమలుకు నోచుకోని అన్నదాత సుఖీభవ

సూళ్లూరుపేట నియోజకవర్గంలో తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం, ఓజిలి, నాయుడుపేట, పెళ్లకూరు మండలాల్లో 69 రైతుభరోసా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. వీటి పరిధిలో సుమారుగా 28 వేల మంది రైతులు ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులను పట్టించుకోకుండా చిన్నచూపు చూస్తూ వారికి సంక్షేమ పథకాలను అమలు చేయలేదు. వ్యవసాయం రంగంలో రైతులకు దుక్కి దున్నేది మొదలు పంట నూర్పిళ్ల వరకు ఆర్బీకేలు అండగా నిలవాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు ఇచ్చిన హామీలను పట్టించుకోవడం లేదు. సూపర్‌సిక్స్ పథకంలో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించి రైతులను ఆదుకుంటారని అందరూ ఊహించారు. కానీ రబీ సీజన్ ప్రారంభమై రైతులు వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు వరి పంటలను సాగు చేసేందుకు విత్తనాలు సిద్ధం చేసుకుంటున్నారు. పెట్టుబడి సాయం ద్వారా రైతులకు రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల హామీలో ఊదరకొట్టిన చంద్రబాబు ప్రస్తుతం ఆ ఊసే ఎత్తడం లేదని రైతులు మండిపడుతున్నారు.

రైతుల వివరాలు

తడ	3925
సూళ్లూరుపేట	5850
దొరవారిసత్రం	6250
పెళ్లకూరు	3750
నాయుడుపేట	3580
ఓజిలి	4050

"

పెట్టుబడి సాయం అందించాలి



ఎన్నికల ప్రచార సమయంలో రైతులకు చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. రైతులకు ఏడాది రూ.20 వేలు పెట్టుబడి సాయం అందించాలి. రబీ సీజన్ ప్రారంభమై వ్యవసాయ పనులు చేసుకుంటున్నాం. విత్తనాలు, ఎరువులు తదితర తీసుకునేందుకు పెట్టుబడి సాయం నగదు అందించాలి.

– ఎం రామయ్య, కర్రబల్లవోలు

నెలలు గడుస్తున్నా పట్టించుకోలేదు



అన్నదాత సుఖీభవ పేరుతో రైతులను చంద్రబాబు మోసం చేశారు. అధికారంలోకి వచ్చాక రైతులను పట్టించుకోలేదు. రైతులకు ఏడాదికి వ్యవసాయం సీజన్‌లో పెట్టుబడులకు నగదు ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హామీ గురించి ఊసే లేదు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– అజ్మతుల్లా, ఆర్మేనిపాడు

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి కింద వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తున్నాం. ఈ-కేవైసీ పూర్తి కాకపోవడంతో కొంత మంది రైతులకు రూ.2 వేలు జమ కాలేదు. బయోమెట్రిక్ ఆధారిత ఈ-కేవైసీని పూర్తి చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. నిబంధనల మేరకు అర్హులైన ప్రతి రైతుకు ఈ పథకం కింద సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

– విజయలక్ష్మి, వ్యవసాయాధికారి, ఓజిలి

క్లుప్తంగా

స్వర్ణముఖికి అడ్డుకట్టలు



మూర్తిరెడ్డిపాళెం వద్ద స్వర్ణముఖికి అడ్డుకట్ట

సాక్షి ఎఫెక్ట్..

నాయుడుపేట టౌన్: నాయుడుపేట మండల పరిధిలో పలుచోట్ల స్వర్ణముఖి నది పొర్లు కట్టల వద్ద సోమవారం రెవెన్యూ, పోలీసు అధికారులు అడ్డుకట్టలు వేశారు. సాక్షి దినపత్రికలో శనివారం నాడు ఆగని ఇసుక దందా శీర్షికన ప్రత్యేక కథనం రావడంతో అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రాజేంద్ర మాట్లాడుతూ నది పొర్లు కట్టలను తెగ్గొట్టి ఉన్న ప్రాంతాలను గుర్తించి అడ్డుకట్టలు వేసి ట్రాక్టర్‌లు తదితర వాహనాలు వెళ్లకుండా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. మండల పరిధిలోని మూర్తిరెడ్డిపాళెం గ్రామంలో రెండు చోట్ల నది పొర్లు కట్ట తవ్వేసి ఉండడంతో వాహనాలు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు తహశీల్దార్ పేర్కొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాచవరంలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ

ఓజిలి: వరి పంటలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని మాచవరం, తిరుమలపూడి, కుందాం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వరి పంటలో కలుపు నివారణ చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. యూరియాను మోతాదుకు మించి వాడితే కలిగే నష్టాలను వివరించారు. పురుగు మందులను తక్కువగా వాడాలని, సేంద్రీయ ఎరువులను ఎక్కువ వాడాలని సూచించారు.

ఎన్‌బీకేఆర్‌లో ఖోఖో జట్టుకు శిక్షణ



జట్టుకు అభినందనలు తెలుపుతున్న విజయకుమార్‌రెడ్డి

కోట: దక్షిణ భారత అంతర విశ్వవిద్యాయాల ఖోఖో పోటీల్లో పాల్గొనే జేఎన్‌టీయూఏ జట్టుకు విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో వారం రోజుల పాటు శిక్షణ ఇచ్చినట్లు కళాశాల పీడీ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. శిక్షణ ముగిసిన క్రమంలో మంగళవారం జట్టు సభ్యులకు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి క్రీడాదుస్తులు పంపిణీ చేసి, అభినందనలు తెలిపారు.ఈ నెల 27నుంచి సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్‌లో నిర్వహించే అంతర విశ్వవిద్యాలయాల ఖోఖో క్రీడాపోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

పేదలకు నిత్యావసరాలు పంపిణీ



నిత్యాసర వస్తువులు అందిస్తున్న సంస్థ సభ్యులు

గూడూరు రూరల్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మంగళవారం పేదలకు నిత్యావసర సరుకులను అందించారు. గూడూరు పట్టణంలోని చర్చి వీదిలో ఉన్న జీఎంయూపీ పాఠశాలలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నిరుపేదలైన 15 మంది క్రైస్తవ కుటుంబాలకు క్రిస్మస్ కానుకగా 18 రకాల వస్తువులను అందించారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, సురేష్, శ్రీనివాసులు, కరిముల్లా, మల్లికార్జున్, క్రిష్టారెడ్డి, నాగరాజు, ప్రసాద్, శ్యాం, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీలు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణంలో మంగళవారం తూనికలు, కొలతల శాఖ గూడూరు డివిజన్ అధికారి భరత్‌కుమార్ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూనికలు, కొలతలకు సంబంధించి పరిక రాలకు ప్రతి ఏడాది ప్రభుత్వ అనుమతి సీళ్ల వేసుకోవాలన్నారు.

సైదాపురంలో వర్షం



సైదాపురంలో కురుస్తున్న వర్షం

సైదాపురం: మండలంలో మంగళవారం ఉదయం నుంచి జల్లులతో వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. చెరువుల్లోకి కూడా వరద నీరు చేరుతోంది. కైవల్యానదిలోకి వరద నీరు వస్తుండడంతో ప్రవాహం పెరిగింది.

డక్కిలిలో..

డక్కిలి: మండలంలో అన్ని గ్రామాల్లో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో జనం అవస్థలు పడ్డారు. ప్రస్తుతం రబీ సీజన్ కావడంతో రైతులు ముమ్మరంగా వ్యవసాయ పనుల్లో మునిగి ఉన్నారు.

27న కరెంటు కష్టాలపై వైఎస్ఆర్ సీపీ నిరసన



ర్యాలీకి అనుమతి కోరుతూ ఎస్ఐకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

నాయుడుపేట టౌన్: కూటమి ప్రభుత్వం ఇష్టారాజ్యంగా విద్యుత్ చార్జీలను పెంచేసిన తీరుపై ఈ నెల 27వ తేదీన వైఎస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఇందుకు అనుమతి కోరుతూ మంగళవారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ ఆదిలక్ష్మిని కలిసి పార్టీ నాయకులు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యుత్ చార్జీల బాదుడుపై సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సారథ్యంలో 27వ తేదీన నాయుడుపేటలో భారీగా మోటార్ బైక్ ర్యాలీ చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని పాత బస్టాండు వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి 27వ తేదీ ఉదయం 10 గంటలకు ర్యాలీ జరిపి విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద చేరుకుని అధికారులకు వినతి పత్రాన్ని అందిచనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, రైతులు, వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఎస్ఐకు కలిసి వినతి పత్రం అందించిన వారిలో వైఎస్ఆర్ సీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు కటకం జయరామయ్య, నాయకులు చదలవాడ కుమార్, దారా రవి, కావేరి పాకం అశోక్, కాలగంధ సునీల్, చిందేటి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

సుఖసంతోషాలతో క్రిస్మస్ వేడుకలు



సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట టౌన్: క్రిస్మస్ పండుగ వేడుకలను సుఖసంతోషాలతో జరుపుకోవాలని కోరుకుంటూ సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నియోజకవర్గ క్రైస్తవులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. సాటి మనుషులపై ప్రేమ, కరుణ, దయ చూపుతూ ప్రతి ఒక్కరు మెలగాలని కోరారు.

క్రిస్మస్ సుఖసంతోషాలు నింపాలి



నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులంతా సుఖసంతోషాలతో జరుపుకోవాలని వైఎస్ఆర్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజలపై ప్రేమ, నిస్సహాయకులపై కరుణ చూపేలా ప్రతి ఒక్కరిపై ఏసుప్రభువు ఆశీస్సులు ఉండాలని శుభాకాంక్షలు తెలియజేశారు.

పోరుబాట కరపత్రాల ఆవిష్కరణ



నేదురుమల్లి నివాసంలో వైఎస్ఆర్ సీపీ పోరుబాట కరపత్రాల ఆవిష్కరణ

వెంకటగిరి(సైదాపురం): వైఎస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న పోరుబాట కరపత్రాలను పట్టణంలోని నేదురుమల్లి నివాసంలో మంగళవారం నాయకులు, కార్యకర్తలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్‌చైర్మన్ సేతరాశి బాలయ్య, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, డక్కిలి జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు మాట్లాడారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం హామీలను విస్మరించిదన్నారు. కరెంటు చార్జీలు పెంచి పేదలపై భారం మోపే దిశగా పయనిస్తోందన్నారు. వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన పోరుబాటకు సమాయత్తం అవుతున్నట్లు వెల్లడించారు. పట్టణంలోని పాలకేంద్రం సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ అధికారులకు వినతి పత్రం సమర్పించి పోరుబాట చేపట్టనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ కాల్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు పులి ప్రసాద్‌రెడ్డి, ఎం.వెంకటేశ్వరరెడ్డి, కౌన్సిలర్లు ఆరి శంకరయ్య, వహీద, కందాటి కళ్యాణి, నాయకులు రమేష్‌రెడ్డి, సతీష్, యస్దానిబాషా, రాజారెడ్డి, చింతపట్ల మురళీ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యలు పరిష్కారం



వినతులు తీసుకుంటున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా

గూడూరు రూరల్: ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సుల ద్వారా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించుకోవచ్చని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా తెలిపారు. గూడూరురూరల్ పరిధిలోని వెందోడు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్యను ఆన్‌లైన్‌లోరా నమోదు చేసి ఎన్ని రోజుల్లో పరిష్కరిస్తామనే విషయం తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రశేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రాత్రి ప్రార్థనలు



పశువుల పాక అలంకరణలో ఏసు పుట్టుక

చిల్లకూరు: ఏసు క్రీస్తు పుట్టిన రాత్రిని పురస్కరించుకుని నిర్వహించే చెట్టు రాత్రి ప్రార్థనలతో అన్ని చర్చిలు కళకళలాడాయి. గూడూరు పట్టణంలోని పీటర్ పాల్ లూథరన్ చర్చిలో పాస్టర్ డేవిడ్ ప్రశాంత రాజ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసు క్రీస్తు పుట్టుక విశేషాలను వివరించారు. యువతీ యువకులు పలు రకాల నాటికలను ప్రదర్శించి అందరిని ఆకట్టుకున్నారు. ఆలయం మొత్తం విద్యుత్ దీపాల వెలుగుతో నిండుకుంది.

ఇల్లు ఆక్రమణపై నిరసన

కలువాయి: తన ఇంటిని కుటుంబ సభ్యులు ఆక్రమించుకున్నారు, ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ కలువాయి దళితవాడకు చెందిన కోడికూతల నాగవేణి మంగళవారం తహశీల్దారు కార్యాలయం ముంగిట బైఠాయించి నిరసన తెలిపారు. తహశీల్దారు, మండల సర్వేయరు, అసిస్టెంట్ సర్వేయర్లు లంచం తీసుకుని తన ఇంటిని వేరే వాళ్లకు రాసి ఇచ్చారని ఆరోపించారు. రెండుగంటల పాటు తహశీల్దారు కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు.

పంటల బీమాకు నెలాఖరు వరకు గడువు

వెంకటగిరి రూరల్: పంటలు సాగు చేసుకుంటున్న రైతులు ఈ నెలాఖరులోపు పంటల బీమా నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జునసాగర్ వెల్లడించారు. మండలంలోని జీకేపల్లి, కుమ్మరిపేట గ్రామంలో మంగళవారం వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ సుజాత, సిబ్బంది ఏఈఓ రామ్మోహన్, గోపికృష్ణ, శ్రీప్రియ, ఏహెచ్ఏ లావణ్య, వేణు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

హామీలతో తాత్కాలికంగా దీక్షలు విరమణ



ఆర్టీసీ అధికారులతో చర్చలు

చిల్లకూరు: గూడూరు ఆర్టీసీ డిపో ఎదురుగా గత 12 రోజులుగా చేస్తున్న రిలే దీక్షలను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు తెలిపారు. మంగళవారం రిలే దీక్షలు చేస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులతో గూడూరు ఆర్టీసీ డిపో అధికారులతో చర్చలు జరిపారు. ఈ క్రమంలో కొన్ని అంశాలకు చెందిన ఒప్పందం జరగడంతో తాత్కాలికంగా దీక్షలను విరమిస్తున్నట్లు నాయకులు తెలిపారు. రీజనల్ కార్యదర్శి శివకుమార్, రఘురామయ్య, మురళీ, క్రిష్ణ, రాము,శీనయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జీసస్ గ్రేస్ చర్చిలో ప్రత్యేక కార్యక్రమాలు



విన్నమాల జీసస్ గ్రేస్ చర్చి వద్ద క్రిస్మస్ వేడుకలు

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని విన్నమాల గ్రామంలో ఉన్న జీసస్ గ్రేస్ ఆపోస్టలిక్స్ చర్చిలో క్రిస్మస్ పురస్కరించుకుని మంగళవారం పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఏసుక్రీస్తు పుట్టుక తదితర అంశాలపై పిల్లలతో నిర్వహించారు. క్రిస్మస్ తాత వేషధారణలతో జరిపిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చర్చి వ్యవస్థాపకురాలు సిస్టర్ వసంతకుమారి, పాస్టర్ ప్రేమ్‌కుమార్, ఎస్తేర్ అమ్రు శేఖర్‌బాబు, సంఘ పెద్దలు ఉన్నారు.

చర్చిలకు కేకుల పంపిణీ

వెంకటగిరి రూరల్: కాశీపేట సమీపం వద్ద ఉన్న పరిశుద్ధ పేతురు లూథరన్ చర్చిలో గుణకల లక్ష్మి ప్రసన్న చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 66 చర్చిలకు వెంకటగిరి సీఐ ఏవీ రమణ, ట్రస్టు నిర్వాహకులు మంగళవారం కేకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ ఏవీ రమణ మాట్లాడుతూ క్రిస్మస్ సందర్భంగా ట్రస్టు ద్వారా వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల్లోని చర్చిలకు కేకులను వితరణ చేయడం హర్షనీయమన్నారు. ట్రస్టు సభ్యుడు సాకి జయచంద్ర మాట్లాడుతూ గుణకల ధనుంజ సతీమణి లక్ష్మీప్రసన్న జ్ఞాపకార్థం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో చర్చి ట్రెజరర్ ప్రభాకర్, రోటరీక్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ బీకే ప్రసాద్, ప్రెసిడెంట్ సుధాకర్, చెస్‌కోస్ వినయ్, ఉపాధ్యాయులు కృష్ణయ్య, రమేష్ పాల్గొన్నారు.

ప్రార్థనా మందిరాలు ముస్తాబు



సైదాపురంలో ముస్తాబైన ప్రార్థనా మందిరం



రామారెడ్డికండ్రిగ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

సైదాపురం: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా మండలంలోని సైదాపురం, కలిచేడు, చాగణం, మర్లపూడి తదితర గ్రామాల్లో ఉన్న ప్రార్థనా మందిరాలు ముస్తాబయ్యాయి. బుధవారం జరిగే క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు క్రైస్తవులు ఉత్సాహంగా మందిరాలను రంగులతో తీర్చిదిద్దతున్నారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం: వివిధ గ్రామాల్లోని చర్చిలను క్రిస్మస్ సందర్భంగా మంగళవారం విద్యుత్ దీపాలు, క్రిస్మస్ ట్రీలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దొరవారిసత్రం, కుప్పారెడ్డిపాళెం, రామారెడ్డికండ్రిగ, నెల్లూరుపల్లి, ఆనేపూడి, ఏకొల్లు, కృష్ణాపురం, మైలాంగం తదితర గ్రామాల్లో ఎస్‌పీఎల్‌సీ చర్చిలు, మందిరాలను విద్యుత్ దీపాలతో భారీ ఎత్తున అలకరించారు.

కోటలో..

కోట: క్రిస్మస్ పర్వదినం వేడుకలకు క్రైస్తవులు సిద్ధమయ్యారు. విద్యానగర్ హోలీప్రేయర్ చర్చి, కోట, చెందోడు, చిట్టేడు, చంద్రశేఖరపురంలోని చర్చిలు, ప్రార్థనా మందిరాలను విద్యుత్ దీపాల సుందరంగా ముస్తాబు చేశారు.

రాపూరులో..

రాపూరు: మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి. పలు చర్చిలను రంగులు, విద్యుద్దీపాలతో అలంకరించారు. మంగళవారం రాత్రి క్రిస్మస్ చెట్టుకు విశేషంగా విద్యుత్ దీపాలంకరణ, గ్రీటింగ్ కార్డులు, బెలూన్స్ అలంకరించారు. క్రీస్తు గొప్పతనాన్ని ఫాదర్ వివరించారు. క్రిస్మస్ తాత వేషధారి చిన్నారుల గృహాలకు వెళ్లి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు,



విద్యుత్ దీప కాంతుల్లో విద్యానగర్ హోలీప్రేయర్ చర్చి



విద్యుద్దీపాలకరణలో రాపూరు చర్చి